సాక్షి
అనకాపల్లి
గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



జిల్లాలో భారీ వర్షం

జిల్లాలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. 8లో



కలెక్టర్ సుడిగాలి పర్యటన

కలెక్టర్ విజయ కృష్ణన్ యలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో సుడిగాలి పర్యటన చేశారు. 8లో



ఫార్మాసిస్టుల ర్యాలీ

మద్దిలపాలెం: ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం సందర్భంగా ఫార్మా స్టూడెంట్లు విశాఖ బీచ్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు.

న్యూస్‌రీల్

కూటమి తీరును నిరసిస్తూ ఉపమాకలో 28న పూజలు

నక్కపల్లి: తిరుమల లడ్డూ ప్రసాదంపై కూటమి ప్రభుత్వ పెద్దలు చేస్తున్న ఆరోపణలకు నిరసనలు తెలపాలని వైఎస్సార్ సీపీ పిలుపునిచ్చిందని రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 28న ఆలయాల్లో పూజలు చేయాలని మాజీ సీఎం జగన్ పిలుపునిచ్చారన్నారు. ఈ మేరకు ఉపమాక వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. తిరుమల ఆలయ పవిత్రతకు భంగం కలిగించే కూటమి ప్రభుత్వం నుంచి తిరుపతి వెంకన్నను కాపాడాలని వేడుకుంటామన్నారు. పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ముఖ్య నాయకులు తరలిరావాలని ఆయన కోరారు.

రేపు బొజ్జన్నకొండపై ప్రారంభోత్సవాలు



బొజ్జన్నకొండ వద్ద జ్ఞాన మందిరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తుమ్మపాల: బొజ్జన్నకొండపై రూ.2.5 కోట్లతో నిర్మించిన జ్ఞాన మందిరం, లేజర్ థియేటర్లను ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రారంభిస్తున్నట్టు జిల్లా పర్యాటక శాఖ ఈఈ రమణ తెలిపారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ఇందుకు బీజం పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో రూ.7.5 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు ఆనాడే శ్రీకారం చుట్టింది. పూర్తయిన పనులను సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు శుక్రవారం వర్చువల్ విధానంలో ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఈ తెలిపారు. ఆయనతోపాటు జీవీఎంసీ జోనల్ కమిషనర్ అప్పలనాయుడు, ఎంపీడీవో కె.వి.నరసింహారావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీరామమూర్తి బొజ్జన్న కొండ వద్ద ఏర్పాట్లు పరిశీలించారు.లేజర్ షో, ఇతర వసతులు మిగిలిన నిధులతో చేపడుతున్నట్లు తెలిపారు.

నామినేటెడ్.. ఫ్రస్ట్రేటెడ్

- నామినేటెడ్ పదవులు దక్కని నేతల్లో నైరాశ్యం
- పార్టీ కోసం కష్టపడినా గుర్తింపు లేదని మండిపాటు
- పార్టీ నిర్ణయంపై అసంతృప్తి

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

అధికారపార్టీ కూటమి నేతల్లో అసంతృప్తి మొదలైంది. మొదటి దఫా నామినేటెడ్ పోస్టుల్లో పదవులు దక్కని నేతలందరూ ఫ్రస్ట్రేషన్‌కు గురవుతున్నారు. పార్టీ నిర్ణయంపై మండిపడుతున్నారు. పార్టీలో మొదటి నుంచీ కష్టపడిన తమకు గుర్తింపు దక్కకపోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. సీటు ఆశించి దక్కకపోయినా పార్టీ గెలుపు కోసం కష్టపడిన తమను గుర్తించకపోవడంపై అసంతృప్తిని వెలిబుచ్చుతున్నారు. ప్రధానంగా పార్టీలో సీనియర్లుగా ఉన్న తమకు కాకుండా కొద్ది మందికి మాత్రమే పదవులు వరించడాన్ని ఆహ్వానించలేకపోతున్నారు. అటు టీడీపీతో పాటు ఇటు జనసేన పార్టీలో ప్రధానంగా ఈ అసంతృప్తులు ఎక్కువగా ఉన్నారు. సీట్ల సర్దుబాటు పేరుతో తమకు సీటు దక్కకపోయినప్పటికీ మిన్నకుండిపోయామని... కూటమి పార్టీ గెలుపు కోసం కష్టపడిన తమకు ఇచ్చే గుర్తింపు ఇదేనా అని వాపోతున్నారు.

ఇరు పార్టీల్లోనూ ఇదే లొల్లి...!

కూటమి పార్టీల్లో ప్రధానంగా టీడీపీ, జనసేన పార్టీల నుంచి ఎక్కువగా అసంతృప్తి వ్యక్తమవుతోంది. జనసేన పార్టీకి చెందిన ఏ ఒక్కరికీ కూడా ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కలేదు. కేవలం టీడీపీకి చెందిన పీలా గోవింద్‌కు మాత్రమే పదవి వరించింది. దీంతో ప్రధానంగా జనసేన నేతల్లో వ్యతిరేకత కనిపిస్తోంది. ఇక తెలుగుదేశం పార్టీలో కూడా సీనియర్లుగా ఉండి.. ప్రతిపక్షంలో కూడా పార్టీతో పాటు ఉండి.. నియోజకవర్గంలో కలియతిరిగిన తమను గుర్తించకపోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

- యలమంచిలి నియోజకవర్గానికి చెందిన ప్రగడ నాగేశ్వరరావు, వప్పల చలపతిరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తోంది.

అధికార పార్టీలో అసంతృప్తుల గోల!



- జనసేన పార్టీ నుంచి భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న పంచకర్ల సందీప్, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న పసుపులేటి ఉషాకిరణ్‌లు పొత్తులో సీటును కోల్పోయారు. దీంతో వీరిద్దరూ తమకు ఏదో ఒక పదవి దక్కకపోతుందా అని ఆశించారు. ఈ జాబితాలో వీరికి మొండిచెయ్యి ఎదురైంది.
- విశాఖ దక్షిణ సీటు ఆశించి భంగపడిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీకి నామినేటెడ్ పోస్టు దక్కలేదు. పైకి ఏమీ మాట్లాడనప్పటికీ లోలోన మాత్రం ఈయన కూడా మండిపడుతున్నట్టు సమాచారం.
- పార్టీలో సీనియరు నేతలుగా ఉన్న మహమ్మద్ నజీర్, విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి మాజీ కార్పొరేటర్ సన్యాసిరావు... గతంలో ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించారు. టికెట్ రాకపోవడంతో నామినేటెడ్ పోస్టును ఆశించారు.
- గతంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడరుగా పనిచేసిన పట్టాభికి కూడా నిరాశే ఎదురైంది.
- దాడి వీరభద్రరావు కుమారుడు దాడి రత్నాకర్ ఎమ్మెల్సీ పదవి లేదా ఏదైనా నామినేటెడ్ చైర్మన్ పోస్టు ఆశించారు. అతడికి మొండి చెయ్యి చూపడంతో బయటికి ఏమీ మాట్లాడకపోయినా దిగువ కేడర్ నుంచి తనకు పదవి ఇవ్వాలనే డిమాండ్ ఉంచేలా సంకేతాలు పంపిస్తున్నారు.
- మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు మరోసారి ఎమ్మెల్సీగా చేయాలని ఉంది అని సన్నిహితుల వద్ద అంటున్నాడు.
- బీజేపీ సీనియర్ నాయకుడు పరుచూరి భాస్కరరావు రాష్ట్ర బీజేపీ నుంచి ఏదైనా పదవి వస్తాదేమో అని ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఏ ఒక్క జనసేన, బీజేపీ నేతకు ఎటువంటి కార్పొరేషన్ చైర్మన్ పోస్టు దక్కకపోవడం ఆ పార్టీ నేతల్లో చర్చనీయాంశమవుతోంది.

ఏజెన్సీలో అదే వేడి...!

ఒకవైపు వర్షాలతో సాధారణ వాతావరణం కొద్దిగా చల్లబడినప్పటికీ... రాజకీయ వాతావరణం మాత్రం వేడెక్కుతోంది. ఏజెన్సీలో మాజీ మంత్రి మణికుమారి, అరకు నుంచి టికెట్ ఆశించి... పోటీ నుంచి తప్పుకున్న దొన్నుదొరతో పాటు పాడేరులో సీనియర్ నేతలుగా ఉన్న చల్లంగి జ్ఞానేశ్వరి, ఎంవీఎస్ ప్రసాద్‌లతో పాటు జనసేన నుంచి పాడేరు టికెట్ ఆశించిన వొంపురి గంగులయ్యలకు ఎటువంటి పదవులు దక్కలేదు. వీరంతా పార్టీ నిర్ణయంపై అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. పార్టీని నమ్ముకున్న తమకు ఎటువంటి పదవులు ఇవ్వకపోవడంపై మండిపడుతున్నట్టు సమాచారం. పార్టీలో మొదటి నుంచీ పనిచేసిన వారికి గుర్తింపు దక్కడం లేదని ఈ నేతలందరూ లోలోపల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తర్వాత ప్రకటించే నామినేటెడ్ పోస్టుల జాబితాలో కూడా తమకు గుర్తింపు దక్కకపోతే మాత్రం బహిరంగంగా అసంతృప్తి వెళ్లగక్కేందుకు కొద్ది మంది నేతలు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

మూడు నెలల ముచ్చటే..

- ఐపీఎస్ బదిలీల గందరగోళం
- అనకాపల్లి ఎస్పీ దీపిక, విశాఖ డీసీపీ–2 బదిలీ
- రెండు నెలల్లోనే స్థాన చలనాలు
- విశాఖ డీసీపీ–2గా మేరీ ప్రశాంతి
- అనకాపల్లి ఎస్పీగా తుహిన్ సిన్హా
- విశాఖ జాయింట్ సీపీ పోస్టు హుష్‌కాకి?



మేరీ ప్రశాంతి



తుహిన్ సిన్హా



ఫక్కీరప్ప



దీపిక

విశాఖ సిటీ: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు దాటింది. ఐపీఎస్‌లకు పోస్టింగ్‌లు ఇచ్చి 70 రోజులే అయింది. మూడు నెలల ముచ్చట తీరకముందే వారిపై బదిలీ వేటు పడింది. దీంతో ఐపీఎస్‌ల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఎందుకు పోస్టింగ్ ఇస్తున్నారో? ఎందుకు బదిలీ చేస్తున్నారో? అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వానికి ఇప్పటికీ ఒక క్లారిటీ లేకపోవడంతోపాటు కొంత మంది అధికారులను విశ్వసించలేకపోవడంతోనే బదిలీల అంశం జఠిలంగా మారుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఐపీఎస్‌లతో పాటు డీఎస్పీ పోస్టింగ్ విషయంలో కూడా కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులవుతున్నా నగరంలో ఏసీపీల పోస్టింగ్ విషయంలో మాత్రం జాప్యం చేస్తూనే ఉంది. రెండు నెలల క్రితమే విశాఖ డీసీపీ–2గా తుహిన్ సిన్హా, అనకాపల్లి ఎస్పీ దీపిక ఎం.పాటిల్‌ను నియమించిన ప్రభుత్వం తాజాగా బదిలీ చేసింది.

ఎందుకిచ్చారు.. ఎందుకు బదిలీ చేశారు..

అల్లూరి జిల్లా ఎస్పీగా ఉన్న తుహిన్ సిన్హాను కూటమి ప్రభుత్వం వచ్చాక విశాఖ డీసీపీ–2గా నియమించింది. ఇప్పుడు ఆయన్ని ఇక్కడి నుంచి బదిలీ చేశారు. అనకాపల్లి ఎస్పీగా దీపిక ఎం.పాటిల్ ఈ ఏడాది జూలై 14న బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు ఆమెను కాకినాడ ఏపీఎస్పీ 3వ కమాండెంట్‌గా నియమించారు. ఆమె స్థానంలో డీసీపీ–2గా ఉన్న తుహిన్ సిన్హాకు అవకాశం కల్పించారు. రెండు నెలల్లోనే ఐపీఎస్‌ల మార్పులపై పోలీస్ అధికారులు సైతం కొంత అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది.

రాజకీయ కారణాలతోనే వేటు..

అనకాపల్లి ఎస్పీ బదిలీ విషయంలో అనేక ఊహాగానాలు చెలరేగుతున్నాయి. రాజకీయ కారణాలు, ఒత్తిళ్లతోనే ఆమెపై బదిలీ వేటు పడిందన్న వార్తలు గుప్పుమంటున్నాయి. ప్రధానంగా అనకాపల్లి జిల్లాలో ఒక జనసేన ఎమ్మెల్యేతో పాటు, టీడీపీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు ఆమెను బదిలీ చేయాలని ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అనకాపల్లి ఎస్పీగా మహిళ అధికారి వద్దని చెప్పడం కారణంగానే ఆమెను ఇక్కడి నుంచి కాకినాడ ఏపీఎస్పీకి పంపించారన్న టాక్ ఉంది.

విశాఖ జాయింట్ సీపీ పోస్టు హుష్‌కాకి?

విశాఖ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఫక్కీరప్పను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనను ఇక్కడ నుంచి ఇంటెలిజెన్స్ ఎస్పీగా నియమించింది. ఆయన స్థానంలో ఎవరినీ నియమించకపోవడంతో జాయింట్ సీపీ సీటు మళ్లీ ఖాళీ అయిపోయింది. మెట్రో నగరాలకు దీటుగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో పోలీస్ వ్యవస్థను పటిష్టం చేసేందుకు గత ప్రభుత్వం జాయింట్ కమిషనర్ పోస్టును భర్తీ చేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ముందు కూడా చాలా ఏళ్ల ఈ సీటు ఖాళీగా ఉండిపోయింది. అప్పట్లో కూడా టీడీపీ ప్రభుత్వమే జేసీపీ పోస్టును భర్తీ చేయలేదు. తాజాగా మళ్లీ జాయింట్ సీపీ పోస్టును భర్తీ చేయకపోవడంతో.. మళ్లీ ఆ సీటు ఖాళీగానే ఉండే అవకాశం ఉందని పోలీస్ శాఖలో చర్చ జరుగుతోంది.

ప్రాణం తీసిన పాత కక్షలు



తీవ్ర గాయాలతో రామకృష్ణ



కేజీహెచ్‌లో మృతి చెందిన రామలక్ష్మి

- అన్నదమ్ముల కుటుంబాల మధ్య ఆస్తి తగాదా
- పరస్పర దాడుల్లో తమ్ముడి కుమార్తె మృతి
- మృతురాలి భర్త పరిస్థితి విషమం
- నిందితుడైన అన్నకు సైతం గాయాలు

గొలుగొండ: భూతగాదా అన్నదమ్ముల కుటుంబాల మధ్య చిచ్చు పెట్టింది. పరస్పరం దాడులు చేసుకొని, ప్రాణాలు తీసుకునే వరకు వెళ్లింది. బుధవారం జరిగిన ఘర్షణలో తమ్ముడి కుమార్తె మృతి చెందగా అల్లుడు కేజీహెచ్‌లో విషమ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్‌ఐ రామారావు, గ్రామస్తులు అందించిన వివరాల మేరకు... గొలుగొండ గ్రామ పంచాయతీ శివారు శ్రీరాంపురం గ్రామంలో చిటికెల తాతీలు, చిటికెల జోగునాయుడు అన్నదమ్ములు. ఇద్దరికీ గ్రామంలో సుమారు రెండు ఎకరాల భూమి ఉంది. వీరి మధ్య 2001 సంవత్సరం నుంచి గొడవలు జరుగుతున్నాయి. బుధవారం ఉదయం తాతీలు పంట పొలం వద్దకు వెళ్లగా అతని తమ్ముడి కుమార్తె రామలక్ష్మి (40), అల్లుడు రామకృష్ణ (అబ్బులు) అక్కడ ఉన్నారు. పంట పొలానికి నీరు విషయమై తాతీలు, రామకృష్ణల మధ్య కొట్లాట జరిగింది. తాతీలు భయంతో పొలం పక్కనే ఉన్న ఇంటికి పరుగెత్తి దాక్కున్నాడు. పొలం నుంచి రామలక్ష్మి, ఆమె భర్త రామకృష్ణ తాతీలు ఇంటికి వెళ్లి అతనిని మళ్లీ కొట్టడంతో.. తాతీలు ఇంట్లో ఉన్న కత్తితో భార్యాభర్తలపై దాడి చేశాడు. ఈ దాడిలో రామకృష్ణ తలపై, రామలక్ష్మి చేతులపై బలమైన గాయాలయ్యాయి. ఒక చేయి పూర్తిగా తెగిపోవడంతో రామలక్ష్మి పరిస్థితి విషమంగా మారింది. వారిద్దరినీ తొలుత నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి, తర్వాత విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ ఆమె సాయంత్రం మృతి చెందింది. పరస్పర ఘర్షణలో తాతీలు మెడకు బలమైన గాయం కావడంతో గొలుగొండ పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. అతనిపై తొలుత హత్యాయత్నం కేసు నమోదు చేసి, రామలక్ష్మి మరణంతో హత్య కేసుగా మార్పు చేశారు. నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ బుధవారం సాయంత్రం గ్రామంలో విచారణ నిర్వహించారు. గ్రామస్తులు, తాతీలు, జోగునాయుడు కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. విశాఖ కేజీహెచ్‌లో రామలక్ష్మి మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహిస్తారని సీఐ తెలిపారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- లారీని బైక్ ఢీకొని ఇద్దరు దుర్మరణం
- ఒకరికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీతాలు



నాగేశ్వరరావు (ఫైల్)



నవీన్ (ఫైల్)

నక్కపల్లి: జాతీయ రహదారిపై ఉద్దండపురం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గొడిచర్ల గ్రామానికి చెందిన ఆవాల నవీన్ (18), కిల్లాడ నాగేశ్వరరావు (25), దేవవరం గ్రామానికి చెందిన దమ్ము సీతాలు ప్రాణ స్నేహితులు. ముగ్గురూ కలిసి మోటారు సైకిల్‌పై నక్కపల్లి నుంచి తుని వైపు వెళ్తున్నారు. ఉద్దండపురం సమీపంలో మోటారు సైకిల్ అదుపు తప్పి ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నవీన్, నాగేశ్వరరావుల తలలకు బలమైన గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. సీతాలుకు కూడా తీవ్ర గాయాలు కావడంతో నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ముగ్గురు యువకులు వ్యవసాయ కూలీ కుటుంబానికి చెందిన వారు. ఈ దుర్ఘటనతో గొడిచర్ల గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు నక్కపల్లి ఆస్పత్రికి చేరుకొని బోరున విలపిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం కోసం నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కుమారస్వామి తెలిపారు.

రెండో రోజూ కూటమి రచ్చే..



వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లతో కూటమి కార్పొరేటర్ల వాగ్వాదం

- వ్యక్తిగత దూషణలకే పరిమితం
- స్థానిక సమస్యలు పక్కనపెట్టి ఆరోపణలతో వాగ్వాదం
- రాత్రి 8 వరకూ జీరో అవర్ పేరిట కాలయాపన
- వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాలపై దాడికి యత్నించిన కూటమి సభ్యులు
- అజెండాలో 75 అంశాల్లో 14 అంశాలపై చర్చ
- గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం వాయిదా



మేయర్‌ను బెదిరిస్తున్న జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, కూటమి కార్పొరేటర్లు

సాక్షి, విశాఖపట్నం : రెండో రోజు కౌన్సిల్ సమావేశంలోనూ కూటమి కార్పొరేటర్లు రచ్చ చేశారు. వార్డు సమస్యలు పక్కనపెట్టి వ్యక్తిగత ఆరోపణలతో సమయాన్ని వృథా చేశారు. సభా మర్యాదలు పాటించకుండా దూషణలతో రెచ్చిపోయారు. మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో కూటమి కార్పొరేటర్ల రచ్చ కారణంగా అజెండాలో ఒక్క అంశంపై కూడా చర్చ జరగకుండానే సమావేశం వాయిదా పడింది. బుధవారం కూడా సొంత అజెండాతో రెచ్చిపోయారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన బుధవారం జీవీఎంసీ సర్వసభ్య సమావేశాన్ని కొనసాగించారు. సభ్యులంతా జీవో అవర్ కోసం పట్టుబట్టారు. దీనికి మేయర్ అంగీకరించడంతో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రతి కార్పొరేటర్ తమ వార్డుల్లో సమస్యలు ప్రస్తావించారు. 98 వార్డులకు సంబంధించి సమస్యలను ఆయా వార్డు కార్పొరేటర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా వీధి దీపాలు వెలగడం లేదని, కొన్ని వార్డుల్లో విద్యుత్ పోల్స్ బాగాలేవని పేర్కొన్నారు. డ్రైనేజీ, శానిటేషన్ సమస్య కూడా ఎక్కువగా ఉందని చెప్పారు. కొండవాలు ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ లేకపోవడంతో భారీ వర్షాల సమయంలో కొండ చరియలు విరిగిపడి, ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పలువురు కార్పొరేటర్లు తెలిపారు. దీంతో మేయర్ స్పందిస్తూ నెల రోజుల్లో జీవీఎంసీ పరిధిలోని అన్ని వార్డుల్లో వీధి దీపాల సమస్య పరిష్కరించాలన్నారు. శానిటేషన్ సమస్య ఉన్న వార్డుల్లో సిబ్బందిని పెంచాలని కమిషనర్‌కు, అధికారులకు ఆదేశించారు.

మేయర్‌తో పీతల మూర్తియాదవ్ వాగ్వాదం

తన 22వ వార్డులో యాదవ సామాజిక వర్గం ఎక్కువని, వారు పెంచుకునే పశువులు రోడ్లపైకి వెళితే ఫైన్‌లు వేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ డిమాండ్ చేశారు. దీనిపై వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్ జోక్యం చేసుకుని.. 'ఎవరో చెప్పిన మాటల ఆధారంగా అధికారులపై చర్యలు తీసుకోవాలనడం సరికాదు.. అది నిజమని నిరూపిస్తే తక్షణ చర్యలు తీసుకుంటారు. ఆ మాత్రానికే గత ప్రభుత్వాన్ని, మా పార్టీ అధ్యక్షుడిని విమర్శిస్తారా.. జీరో అవర్‌లో కూడా వ్యక్తిగత దూషణలకు పాల్పడడం సరికాదు.. నీపై మీ ప్రభుత్వంలో పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. నీవు ఒక క్రిమినల్‌వంటూ' పీతలకు ఘాటుగా సమాధానం ఇచ్చారు. దీంతో తనను క్రిమినల్ అన్నారంటూ.. తక్షణమే ఆ మాటను వెనక్కి తీసుకోవాలని మూర్తి యాదవ్, కూటమి కార్పొరేటర్లు పోడియం వద్దకు వెళ్లి మేయర్‌తో వాగ్వాదానికి దిగారు. మేయర్‌ను ఏకవచనంతో దూషించారు. నా రూల్ పొజిషన్ నేను మాట్లాడతా.. మేయర్ చైర్‌కు గౌరవం ఇచ్చి మాట్లాడాలి. మీరు గత ప్రభుత్వంపై మాట్లాడిన మాటలు వెనక్కి తీసుకోవాలి.. జీరో అవర్‌లో స్థానిక సమస్యలు చెప్పాలి. కానీ మీరు వ్యక్తిగత దూషణలకు పాల్పడి, పరిమితిని మించి మాట్లాడుతున్నారు. సభా సంప్రదాయం పాటించకుంటే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కార్పొరేటర్ బిపిన్ జైన్ సస్పెన్షన్

సభా సంప్రదాయలకు విరుద్ధంగా మాట్లాడినందుకు కార్పొరేటర్ బిపిన్ జైన్‌ను మేయర్ గొలగాని హరివెంకటకుమారి సస్పెండ్ చేశారు. జీరో అవర్‌లో బిపిన్ జైన్ తన వార్డు పరిధిలో జైల్ రోడ్డులో ఉన్న ఫుడ్ కోర్టును తొలగించాలని డిమాండ్ చేశారు. ఏడాదిన్నర క్రితం ఫుడ్ కోర్టు తీసేయాలని జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానం చేసినా ఎందుకు చేయలేదంటూ ప్రశ్నించారు. నైట్ ఫుడ్‌కోర్ట్‌లో 101 దుకాణాలకు అనుమతులిస్తే.. ప్రస్తుతం 179 వరకు వచ్చేశాయన్నారు. మేయర్ స్పందిస్తూ.. వెంటనే అందరినీ అక్కడి నుంచి ఖాళీ చేయించాలని ఆదేశించారు. ఆ తర్వాత జీరో అవర్‌లో సమస్యలు చెప్పేందుకు అవకాశం కల్పించినా.. అన్‌పార్లమెంటరీ లాంగ్వేజ్‌తో మాట్లాడిన బిపిన్ జైన్‌ను సస్పెండ్ చేయాలంటూ కూటమి కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. దీంతో కౌన్సిల్ సమావేశం వరకూ బిపిన్ జైన్‌ను సస్పెండ్ చేస్తూ మేయర్ ఆదేశాలు జారీ చేశారు.

కమీషన్లు పెరుగుతున్నాయి

సీపీఎం కార్పొరేటర్ బి.గంగారాం మాట్లాడుతూ.. కౌన్సిల్ సమావేశంలో అందరూ అవినీతిని రూపుమాపుదామని అన్నారు. చాలా మంచి పరిణామం. కానీ ఇది ఒక్కరితో కాదు.. అందరితో సాధ్యమయ్యేది. కాంట్రాక్ట్ పనుల్లో 5 శాతం కమీషన్ వచ్చేదంట. ఇప్పుడు ధరలు పెరిగి 8 శాతానికి చేరిందట. బ్యూరోక్రాట్స్‌కు 6 శాతం, కాంట్రాక్టర్లకు 30 శాతం ఇవ్వాలంట. ఇలా 44 శాతం కమీషన్లకే పోతే.. నాణ్యత ఎలా ఉంటుంది. అవినీతి లేకుండా కలిసి పనిచేద్దాం. అప్పుడు అవినీతి రహిత విశాఖ నగరం ఏర్పడుతుంది.. అని అన్నారు.

కౌన్సిల్లో హాయిగా 'నిద్ర'

కౌన్సిల్ ప్రారంభమైన రెండు గంటల తరువాత బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు వచ్చారు. గంటన్నర పాటు కౌన్సిల్‌లో ఉంటే.. అందులో గంటసేపు హాయిగా కునుకు పాట్లు తీశారు. ఇటు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లపై కూటమి కార్పొరేటర్లు దాడికి యత్నిస్తున్నా, వాటిని పట్టించుకోకుండా హాయిగా నిద్రపోయారు. లంచ్ సమయం వరకు ఉండి వెళ్లిపోయారు.

బాణాలపై హనోక్ దాడికి యత్నం



బాణాలపై దాడికి యత్నిస్తున్న హనోక్

జీరో అవర్‌లో కంపా హనోక్ మాట్లాడుతూ గతంలో పనుల కోసం నాయకుల చుట్టూ తిరిగేవాళ్లమని.. అలాగే ప్రభుత్వ పెద్దల ఇళ్ల వద్దే రోడ్లు వేశారని ఇప్పుడు అలా కాకుండా చూడాలన్నారు. దీనిపై వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల స్పందించి ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి వెళ్లే కంపాకు గత ప్రభుత్వాన్ని, తమ నాయకులను విమర్శించే నైతికత లేదన్నారు. టీడీఆర్‌ల అవినీతికి పాల్పడ్డావని బాణాలను ఉద్దేశించి హనోక్ విమర్శించగా. ఇప్పుడున్నది కూటమి ప్రభుత్వమే కదా దమ్ముంటే విచారించుకోవాలని బాణాల సవాల్ విసిరారు. ఈ సమయంలో నువ్వు డస్ట్ బిన్ నాయకుడివంటూ బాణాలపైకి కంపా హనోక్ దాడి చేసేందుకు మీదకి వచ్చారు. దీంతో ఇరు పార్టీల కార్పొరేటర్లు వెళ్లి వారించారు.

11 అంశాల ఆమోదం

అజెండాలో మొత్తం 75 అంశాలను పొందుపరిచారు. వీటిలో 14 అంశాలపై చర్చించగా తొలి 11 అంశాలు ఆమోదం పొందాయి. ఇందులో ప్రధానమైనవి కొన్ని..

- జీవీఎంసీ ఐటీ విభాగంలో సర్వర్, సాఫ్ట్‌వేర్ నిర్వహణకు 2024–25కుగాను అంచనా వ్యయం రూ.61,38,360 కేటాయింపు.
- జీవీఎంసీ ప్రజారోగ్య విభాగంలో పొరుగు సేవ పారిశుద్ధ్య కార్మికులకు కొబ్బరి నూనె, సబ్బుల కొనుగోలుకు రూ.1.14 కోట్లు కేటాయిస్తూ ఆమోదం
- ప్రజారోగ్యం విభాగంలో ఔట్‌సోర్సింగ్ కార్మికులు 5,468 మందికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున రూ.54.68 లక్షల కేటాయింపు
- ఇంజినీరింగ్ విభాగంలో జోన్–7, జోన్–8లో మొత్తం 40 మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు(టెక్నికల్, నాన్ టెక్నికల్), లిఫ్ట్ ఆపరేటర్లు, సెక్యూరిటీ గార్డుల సేవలకు రూ.1.32 కోట్ల అంచనా వ్యయానికి ఆమోదం.
- బాల్యం విద్యాపథకం కింద ఔట్‌సోర్సింగ్ సిబ్బంది 46 మంది బాల్యం టీచర్లు, 42 మంది ఆయాలను కొనసాగించేందుకు రూ.84,82,860 కేటాయిస్తూ ఆమోదం.
- ఉద్యానవన విభాగంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో 42 మంది ఉద్యోగుల కొనసాగింపునకు రూ.88.26 లక్షలు కేటాయిస్తూ ఆమోదం.
- రోడ్లపై సంచరిస్తున్న శునకాలు, పందులు, పశువుల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కొనసాగింపునకు రూ.156.72 కోట్ల కేటాయింపు.

ఉద్యానవన డీడీపై విచారణకు మేయర్ ఆదేశం

అజెండాలోని 9వ అంశంలో ఉద్యానవన శాఖలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కొనసాగిస్తూ ఆమోదం కోసం ప్రతిపాదించగా, కూటమి సభ్యులు అభ్యంతరం తెలిపారు. దీన్ని వాయిదా వేయాలని కోరారు. ఉద్యోగులు లేకున్నా.. ఉన్నట్లు అధికారులు జీతాలు డ్రా చేస్తున్నట్లు ఆరోపించారు. దీంతో కార్పొరేటర్ గంగారావు జోక్యం చేసుకుని వాయిదా సరికాదు. అధికారి తప్పు చేస్తే విచారణకు ఆదేశించాలని మేయర్‌ను కోరారు. దీంతో మేయర్ గొలగాని హరివెంకటకుమారి విచారణకు కమిషనర్‌ను ఆదేశించారు.

క్లుప్తంగా

జూడో పోటీల్లో వడ్డాది విద్యార్థుల ప్రతిభ



రోహిణి, చరణ్(రజతం), రిషిలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చెయ్యపేట: రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో వడ్డాది కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఈ నెల 22, 23 తేదీల్లో తిరుపతిలో అండర్–14 బాల బాలికల స్కూల్ గేమ్స్ జూడో పోటీలు జరిగాయి. ఈ పోటీలకు వడ్డాదికి చెందిన ముగ్గురు విద్యార్థులు దాసరి రోహిణి, గోడ చరణ్, పాంగి రిషి ఎంపికయ్యారు. 40 కేజీల విభాగంలో గోడ చరణ్ ప్రతిభ చూపి ద్వితీయ స్థానంలో నిలిచాడు. జూడో పోటీలకు ఎంపికై రజత పతకం సాధించిన చరణ్‌తో పాటు పోటీల్లో పాల్గొన్న రోహిణి, రిషిలను బుధవారం పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటరావు, ఉపాధ్యాయుడు ఎస్.వి.సత్యనారాయణ, పీడీ నరసింగరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వెంకటరమణ అభినందించారు.

ఉత్సాహంగా మహిళా కబడ్డీ పోటీలు



కబడ్డీ ఆడుతున్న గుంటూరు, కృష్ణా జిల్లాల జట్లు

మునగపాక: మరిడిమాంబ అమ్మవారి పండగలో భాగంగా మునగపాక నందీశ్వర ప్రాంగణంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.శ్రీనివాసరావు సౌజన్యంతో జరిగిన ఈ పోటీలకు విశాఖ, విజయనగరం, గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. గుంటూరు, కృష్ణా జిల్లాల జట్ల మధ్య పోటీ ఉత్సాహంగా సాగింది. మునగపాక పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో యలమంచిలి ఎమ్మెల్యే సోదరుడు సుందరపు రవి కుమార్, మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురామ్, ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ పాల్గొన్నారు.

నేడు హైపవర్ కమిటీ ఫార్మాసిటీ సందర్శన

మహారాణిపేట(విశాఖ): పరిశ్రమలకు సంబంధించి హైపవర్ కమిటీ చైర్‌పర్సన్ వసుధ మిశ్రా గురువారం ఫార్మాసిటీలో పర్యటించనున్నారు. ఇటీవల అచ్యుతాపురం, పరవాడలోని పలు కంపెనీల్లో ప్రమాదాల్లో జరిగిన సంగతి విదితమే. ఆయా పరిశ్రమలను స్వయం పరిశీలించడానికి చైర్‌పర్సన్ ఆ ప్రాంతాలకు వెళ్లనున్నారు.

జిల్లాలో భారీ వర్షం

- నిలిచిన దోనె ప్రయాణాలు
- యుద్ధప్రాతిపదికన స్పిల్‌వే గేట్ల ద్వారా 1200 క్యూసెక్కుల నీరు విడుదల



రైల్వేఅండర్ బ్రిడ్జి కింద నీటిలో నిలిచిపోయిన కళాశాల బస్సు





కశింకోటలోని గవరపేటలో నిలిపి వేసిన దోనెలు (ఇన్‌సెట్) పెద్దేరు జలాశయం నుంచి వరద నీరు విడుదలవుతున్న దృశ్యం

తుమ్మపాల: జిల్లా వ్యాప్తంగా మంగళవారం రాత్రి పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రోడ్లు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు, పంటపొలాల్లోకి భారీగా నీరు చేరింది. జిల్లా వ్యాప్తంగా 1102.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యధికంగా కశింకోట మండలంలో 159.2 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా మాడుగుల మండలంలో 3.8 మిల్లీ మీటర్లు నమోదైంది.

అనకాపల్లి పట్టణం జలమయం

జిల్లా కేంద్రమైన అనకాపల్లి పట్టణం జలమయమైంది. పట్టణంలోని గుండాల రోడ్డులో రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద పరిస్థితి చాలా దారుణంగా మారింది. అండర్‌బ్రిడ్జి ప్రాంతం వర్షపునీటితో నిండిపోయింది. అటుగా రాకపోకలు సాగించిన వాహనచోదకులు నరకయాతనపడ్డారు. అండర్ బ్రిడ్జి వద్ద బుధవారం ఉదయం కూడా నీళ్లు నిలిచి ఉండడంతో ఓ ప్రైవేట్ కళాశాల బస్సు నీటిలో నిలిచిపోయింది. బస్సులో ఉన్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

శారద ఉధృతి

కశింకోట: కశింకోటలోని గవరపేటలో శారదానది నీటిమట్టం పెరగడంలో బుధవారం దోనె ప్రయాణాలు నిలిచిపోయాయి. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు భారీగా వరద నీరు వచ్చి చేరడంతో నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దోనెలు నడవకపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. గవరపేట ప్రాంత రైతుల పొలాలు, పశువుల శాలలు ఎక్కువగా నది అవతల ఒడ్డున ఉన్నాయి. దీంతో పొలాల్లో వ్యవసాయ కార్యకలాపాలు సాగించడానికి, పశువులను సంరక్షించి పాలు సేకరించడానికి నిత్యం రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. దోనె ప్రయాణాలు నిలిపివేయడంతో సుమారు 3 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సివచ్చింది.

ప్రమాదస్థాయికి ‘తాండవ’ నీటిమట్టం

నాతవరం: తాండవ రిజర్వాయర్‌లో ప్రమాద స్థాయిని నివారించేందుకు స్పిల్‌వే గేట్ల ద్వారా నదిలోకి 1200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని ఇరిగేషన్ ఈఈ స్వామినాయుడు తెలిపారు. పంట కాలువల ద్వారా రోజుకు 550 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నా ఎగువ ప్రాంతం నుంచి అధికమొత్తంలో నీరు రావడంతో బుధవారం మధ్యాహ్ననికి ప్రాజెక్టులో నీటిమట్టం 379 అడుగులకు (ప్రమాదస్థాయి 380 అడుగులు) వచ్చేసిందన్నారు. అప్రమత్తమై వెంటనే స్పిల్‌వే గేట్ల ద్వారా నదిలోకి నీటిని విడుదల చేసి ప్రమాదస్థాయిని తగ్గించామన్నారు. ముందుగా తాండవ నదీ పరీవాహక ప్రాంతంలో ఉన్న నాతవరం, కొయ్యూరు, కోటనందూరు, తుని మండలాల అధికారులకు సమాచారం ఇచ్చి స్పిల్‌వే గేట్ల ద్వారా నదిలోకి నీరు విడుదల చేశామన్నారు. రాత్రి సమయంలో పశువులు, ప్రజలు నదిలోకి దిగరాదన్నారు. తాండవ ప్రాజెక్టు జేఈ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

‘పెద్దేరు’ నుంచి 350 క్యూసెక్కుల వరద నీరు విడుదల

మాడుగుల: పెద్దేరు జలాశయం బుధవారం సాయంత్రం ప్రమాద స్థాయికి చేరుకుంది. దీంతో అధికారులు ప్రధాన గేటు ద్వారా 350 క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేశారు. జలాశయం గరిష్ట నీటి మట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం 135.60 మీటర్లకు చేరుకుంది. పెద్దేరు క్యాచ్‌మెంట్ ఏరియాలో అధికంగా వర్షాలు కురుస్తుండడంతో జలాశయంలోకి వరద నీరు వస్తోందని, పెద్దేరు నది పరీవాహక ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

మండలాల వారీగా వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మిల్లీమీటర్లు)	మండలం	వర్షపాతం (మిల్లీమీటర్లు)
కశింకోట	159.2	నక్కపల్లి	21.8
పరవాడ	126.0	బుచ్చెయ్యపేట	20.4
గొలుగొండ	120.2	చోడవరం	20.0
మునగపాక	108.8	అచ్యుతాపురం	14.2
దేవరాపల్లి	102.6	కె.కోటపాడు	13.8
నర్సీపట్నం	80.4	చీడికాడ	13.4
అనకాపల్లి	60.8	రాంబిల్లి	11.2
పాయకరావుపేట	52.8	కోటవురట్ల	10.8
రోలుగుంట	49.4	యలమంచిలి	9.8
రావికమతం	42.8	ఎస్.రాయవరం	9.2
నాతవరం	38.4	మాకవరపాలెం	8.6
		మాడుగుల	3.8

కోర్టు భవనాల నిర్మాణ వ్యయం తగ్గించండి



కోర్టు భవనాల పునర్నిర్మాణ పనుల గురించి అధికారులు, న్యాయవాదులతో చర్చిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

- ఆర్‌అండ్‌బీ అధికారులకు కలెక్టర్ సూచన
- యలమంచిలి ఆస్పత్రి, దిబ్బపాలెం క్రీడామైదానం పరిశీలన

యలమంచిలి రూరల్: శిథిలమైన యలమంచిలి కోర్టు భవనాల పునర్నిర్మాణ వ్యయాన్ని తగ్గించడానికి మళ్లీ ప్లాన్ రూపొందించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ సూచించారు. బుధవారం ఆమె పట్టణంలో పర్యటించారు. న్యాయస్థానాల భవన నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉండడంతో ఆమె వాటిని పరిశీలించారు. ఈ పనులెందుకు జరగలేదో స్థానిక ఆర్‌అండ్‌బీ అధికారులను అడిగారు. గతంలో రోడ్లు, భవనాల శాఖ రూపొందించిన ప్లాన్ ప్రకారం భవన నిర్మాణాలకు రూ.22 కోట్లు ఖర్చవుతుందని అంచనాలు తయారు చేసినట్టు డీఈఈ విద్యాసాగర్ తెలిపారు.

ఈ అంచనాలను హైకోర్టుకు పంపగా ప్లాన్‌తో పాటు భవన నిర్మాణాలకు డీపీఆర్ తయారు చేయాలని హైకోర్టు రిజిస్ట్రార్ ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారన్నారు. డీపీఆర్ తయారు చేసేందుకు టెండర్లు పిలిచే ప్రక్రియ చేపట్టాల్సి ఉందని కలెక్టరుకు చెప్పారు. నిర్మాణ విస్తీర్ణాన్ని తగ్గించి, వ్యయం రూ.22 కోట్ల కంటే తక్కువ అయ్యేలా కొత్తగా ప్లాన్ తయారు చేయాలని కలెక్టరు డీఈఈకి సూచించారు. కోర్టు భవనాల పునర్నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కలెక్టర్‌ను కోరారు. అనంతరం తులసీనగర్‌లోని నూతన ఆస్పత్రి భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. రోగులు, వైద్యులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆమె వెంట ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఆర్డీవో చిన్నికృష్ణ తదితరులు ఉన్నారు.

దిబ్బపాలెంలో క్రీడామైదానం పరిశీలన

అచ్యుతాపురం (మునగపాక): అచ్యుతాపురం మండలం దిబ్బపాలెంలో బుధవారం కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పర్యటించారు. దిబ్బపాలెంలో ఏర్పాటు చేయనున్న క్రీడా మైదానాన్ని పరిశీలించారు. ఇక్కడ క్రీడల నిర్వహణకు అవసరమయ్యే చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మైదానాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం అచ్యుతాపురం కూడలిలో విస్తరణ పనులకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. ఆర్డీవో చిన్నికృష్ణ పాల్గొన్నారు.

పంచదార్ల పుణ్యక్షేత్రం అభివృద్ధికి కృషి

రాంబిల్లి (యలమంచిలి): కలెక్టర్ విజయ కృష్ణన్ ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌తో కలసి పంచదార్ల పంచాయతీ ధారపాలెంలో ఉన్న ఉమాధర్మలింగేశ్వరస్వామి వారి పుణ్యక్షేత్రాన్ని సందర్శించారు. ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరచడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రజా సేవలోనే ఆనందం

- ఎక్కడో మారుమూల జన్మించిన నాకు మాజీ సీఎం జగన్ అవకాశం కల్పించారు
- జెడ్పీ చైర్‌ఎపర్సన్‌గా మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జల్లిపల్లి సుభద్ర



ఉద్యోగులు, అధికారులకు కేక్ తినిపిస్తున్న జిల్లా పరిషత్ చైరపర్సన్ జె.సుభద్ర

మహారాణిపేట(విశాఖ): ప్రజాసేవలో తనకు ఎంతో ఆనందం ఉంటుందని జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జెడ్పీ ఉద్యోగులు ఆమెను తన బంగ్లాలో బుధవారం మర్యాద‘పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ రాజకీయాలే పరిచయం లేని తనను మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ సదవకాశాన్ని కల్పించారన్నారు. ఏ ఆశయ సాధన కోసం తనకీ అవకాశాన్నిచ్చారో, ఆ లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాలన్న జగన్మోహన్ రెడ్డి ఆకాంక్షలు నెరవేర్చేలా నిరంతరం కృషి చేస్తున్నానన్నారు. గిరిజనులకు అందని ద్రాక్షగా మిగిలిన విద్య, వైద్యంలో సమూల మార్పులకు కృషి చేసిన సంతోషం తనకు దక్కిందన్నారు. కేజీహెచ్ ఎస్టీ సెల్ అంటే భయపడే స్థితి నుంచి అక్కడ మెరుగైన వైద్యం అందుతుందన్న నమ్మకాన్ని గిరిజనుల్లో పెంచేందుకు జరిగిన కృషిలో తన భాగస్వామ్యాన్ని అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు రావాలన్న జగన్ ఆశయ సాధన దిశగా తాను కూడా అడుగులు వేసినందుకు సంతోషంగా ఉందన్నారు. తనకు ఇచ్చిన అవకాశం మేరకు పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళాలు



కలెక్టర్‌కు రూ.25 లక్షల చెక్కు అందిస్తున్న టయోస్సు రేర్ ఎర్త్స్ కంపెనీ ఎండీ కోయిచి సాటో



ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు విరాళం చెక్కును అందిస్తున్న విజయ్ ప్రకాష్

పాయకరావుపేట: వరద బాధితుల సహాయార్థం పలు సంస్థలు సీఎం సహాయ నిధికి విరాళాలు అందించాయి. శ్రీప్రకాష్ విద్యా సంస్థలు ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.10 లక్షలు విరాళం ప్రకటించాయి. ఈ మేరకు విరాళం చెక్కును ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను విద్యా సంస్థల డైరెక్టర్ చిట్టూరి విజయ్ ప్రకాష్ విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాత్రి కలిసి అందజేశారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ సిహెచ్.వి.కె.నరసింహారావు మాట్లాడుతూ వరదల కారణంగా నష్టపోయిన వారికి ఈ సహాయం ద్వారా పునరావాసం, నష్టపరిహారం, సహాయక చర్యల్లో కొంత ఉపశమనం కలగాలని ఆశిస్తున్నామన్నారు.

వరద బాధితులకు రూ.25 లక్షల సాయం

తుమ్మపాల: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు మెస్సర్స్ టయోస్సు రేర్ ఎర్త్స్ కంపెనీ (రాంబిల్లి) ముందుకొచ్చింది. ఈ మేరకు బుధవారం కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కోయిచి సాటో కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయ కృష్ణన్‌కు కలిసి రూ.25 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ బి.మురళీధరరావు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్ పాల్గొన్నారు.


సూపర్‌సిక్స్ అమలులో ‘కూటమి’ విఫలం



సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం ‘థాలీ భజావో’ పేరిట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

తుమ్మపాల: కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయినా సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడంతో విఫలమైందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న ధ్వజమెత్తారు. కలెక్టరేట్ వద్ద ‘థాలీ భజావో’ పేరిట బుధవారం పార్టీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ప్రభుత్వాన్ని నిద్ర లేపడం కోసమే ‘థాలీ భజావో’ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అమలు చేయని దగాకోరు ప్రభుత్వం.. మంచి ప్రభుత్వం అంటూ ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిరుద్యోగ భృతి, యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ప్రతి పేద కుటుంబానికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15వేలు, 18 నుంచి 59 సంవత్సరాల మహిళలకు ప్రతినెలా రూ.1500 ఆర్థిక సహాయం, రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సహాయం ఎప్పుడిస్తారని ఆయన ప్రశ్నించారు. అనంతరం డీఆర్వో బి.దయానిధికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బి.కిషోర్, ఉపాధ్యక్షుడు బి.బాలమురళి, పీసీసీ సభ్యులు టి.రమణ, ఎం.కోటేశ్వరరావు, బి.భానుమూర్తి యాదవ్, పడాల కొండలరావు, కె.సత్యనారాయణ, కత్తెర శ్రీధర్, ఆదిమూర్తి, ఆర్‌ఆర్ నాయుడు, జి.శ్రీనివాస్, యేసు రాజు, దాలి నాయుడు, బి.రమణ పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన వ్యాన్



వ్యాన్‌ను క్రేన్‌తో బయటకు తీస్తున్న హైవే నిర్వహణ సంస్థ సిబ్బంది

యలమంచిలి రూరల్: చెన్నై నుంచి పాట్నాకు భారీ జనరేటర్‌తో వెళ్తున్న ఓ వ్యాన్ యలమంచిలి మండలం తండాలదిబ్బ కూడలికి సమీపంలో 16వ నంబరు జాతీయ రహదారిపై బుధవారం అదుపుతప్పి బోల్తా పడింది. రోడ్డు పక్కన ఉన్న కాలువలోకి దూసుకెళ్లిన వ్యాన్.. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఆ సమయంలో విద్యుత్ వైర్లు తెగిపడకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది సరఫరాను నిలిపివేశారు. జనరేటర్‌తో సహా బోల్తా పడిన వ్యాన్‌ను రెండు భారీ క్రేన్ల సహాయంతో బయటకు తీశారు. దెబ్బతిన్న స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేసి, సమీప గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని ఆ శాఖ సిబ్బంది తెలిపారు. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్ గాయపడ్డాడు. హైవే పెట్రోలింగ్ పోలీసులు బోల్తా పడిన వ్యాన్‌ను బయటకు తీయించే పనులను పర్యవేక్షించారు.

తాండవ నదిలో యువకుడి గల్లంతు



గల్లంతైన వ్యక్తి కోసం గాలిస్తున్న పోలీసులు

పాయకరావుపేట: మండలంలోని మాసాహెబుపేట గ్రామం వద్ద తాండవ నదిలో బుధవారం ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఈ మేరకు సీఐ జి.ఎస్.అప్పన్న తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సత్యవరం గ్రామానికి చెందిన ఏనుగు శివమోహన్ అనే యువకుడు 10 మందితో కలిసి నది ఆవతలవైపున ఉన్న పొలాలకు వెళ్లి తిరిగొస్తున్నాడు. నదిపై ఉన్న స్తంభాల వంతెనపై నడుస్తుండగా కాలు జారి పడిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. గల్లంతైన యువకుడి కోసం గురువారం ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు వచ్చి గాలించనున్నారు.

నిధులను దోచేస్తున్న ఉన్నతాధికారి

- ఏపీ కమ్యూనిటీ నేచరల్ ఫార్మింగ్ సంస్థ ఉద్యోగుల ఆరోపణ

తుమ్మపాల: ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచరల్ ఫార్మింగ్ –రైతు సాధికారిక సంస్థ ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించేందుకు మంజూరు చేస్తున్న నిధులను జిల్లా అధికారిగా ఉన్న పీడీ లచ్చన్న పక్కదారి పట్టించి, దోచుకుంటున్నారని డివిజినల్ ఎంటీ పి.నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని విజయ రెసిడెన్సీ హోటల్లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వ్యవసాయ పనులకు నకిలీ బిల్లులు పెడుతున్నారని, తప్పుడు నివేదికలను ఉన్నతాధికారులకు చూపిస్తూ కొన్ని లక్షల రూపాయలు స్వాహా చేశారన్నారు. ప్రాజెక్టులో ప్రమోషన్లు అర్హతలు ఉన్నవారికి కాకుండా తన బినామీలైన అర్హత లేనివాళ్లకి అమ్ముకుంటున్నారన్నారు. ప్రశ్నించిన వారిని కులం పేరుతో దుషించినట్టు కేసు పెడతానని బెదిరిస్తున్నారని, ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ఆయనతోపాటు అతని బినామీలైన ఆరుగురిని ప్రాజెక్టు నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి ఎస్.నాగేశ్వరరావు, బి.కృష్ణ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన ఎమ్మెల్యేపై చర్యలేవీ?

- దళిత డాక్టర్‌పై దాడి చేసిన నానాజీపై కేసు నమోదు చేయాలి
- దేవరాపల్లిలో దళిత సంఘాల నాయకుల నిరసన



దేవరాపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

దేవరాపల్లి: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపేసిన ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుతో పాటు దళిత డాక్టర్‌పై దాడి చేసిన ఎమ్మెల్యే పంతం నానాజీలను తక్షణమే అరెస్ట్ చేయాలని దేవరాపల్లి దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు దేవరాపల్లిలో దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా ప్రవర్తించిన రఘురామకృష్ణంరాజు, దళిత డాక్టర్‌ను బహిరంగంగా కులం పేరుతో దూషించిన నానాజీపై అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యేలపై ఇప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై మండిపడ్డారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు కాటపల్లి అప్పారావు, వేచలపు గంగాధరరావు, పరవాడ అప్పారావు, సబ్బవరపు మాలిబాబు, కంచిమాల అప్పారావు, తాడి ఎర్నిబాబు, కాటపల్లి నాగభూషణం, ఉల్లి దేముళ్లు, కన్నాబత్తుల రాజు, కాటపల్లి అప్పారావు, సబ్బవరపు దారప్ప, సుదర్శన్, దువ్వాడ రమేష్, పరశురామ్, సన్నిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగి గోవిందరావుకు ఘన నివాళి



ఆర్మీ ఉద్యోగి గోవిందరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భరత్‌కుమార్, తదితరులు

కశింకోట: అనారోగ్యంతో మృతి చెందిన ఆర్మీ ఉద్యోగి పెంటకోట గోవిందరావు చిత్ర పటానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జమ్ము, కశ్మీర్‌లోని ఉదంపూర్‌లో పని చేస్తూ పచ్చ కామెర్ల బారిన పడి ఇటీవల విశాఖలోని కల్యాణి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గోవిందరావు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ మేరకు గవరపేటలోని తన నివాసంలో గోవిందరావు పెద్ద కర్మ బుధవారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులను భరత్‌కుమార్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు, ఆర్మీ ఉద్యోగులు, మాజీ సైనికోద్యోగులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలు శిక్ష

చోడవరం రూరల్: వరకట్నం వేధింపులతో పాటు పిల్లనిచ్చిన మామపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ స్థానిక సీనియర్ సివిల్ జడ్జి ఇ.రాజేంద్రబాబు తీర్పునిచ్చారు. బుధవారం అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఈ కేసుకు సంబంధించిన వివరాలను విలేకరులకు తెలియజేశారు. 2021, జూలై 29న బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట గ్రామానికి చెందిన నిందితుడు సింగంపల్లి రాము తన భార్యను వరకట్న వేధింపులకు గురి చేస్తుండడంతో అదే గ్రామంలో ఉంటున్న మామ ముత్యాల నూకరాజు నిలదీశారు. ఇది కాస్త ఇరువురి మధ్య ఘర్షణకు దారితీసింది. దీంతో రాము తన వద్ద ఉన్న చాకుతో నూకరాజు మెడపై గాయపరిచాడు. మామ ఫిర్యాదు మేరకు అప్పటి బుచ్చెయ్యపేట పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్ బి.రామకృష్ణ కేసు నమోదు చేసి, అనకాపల్లి జిల్లా ఎస్పీ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టారు. చోడవరం అదనపు జిల్లా కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. కేసు విచారించిన సీనియర్ సివిల్ జడ్జి రాజేంద్రబాబు ప్రాసిక్యూషన్ వాదనలు, హాజరుపరిచిన సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన మీదట ఈ మేరకు తీర్పు చెప్పారు. రూ.5 వేలు జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. అలాగే గాయపడిన నూకరాజుకు రూ.25వేలు నష్ట పరిహారం చెల్లించాలని తీర్పులో స్పష్టం చేశారు. అదనపు పీపీ వేచలపు వెంకటరమణ ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తు చేసిన బుచ్చియ్యపేట ఎస్ఐ రామకృష్ణ, వాదనలు వినిపించిన అదనపు పీపీ వెంకటరమణలతో పాటు పోలీస్ సిబ్బంది, కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బంది, సాక్షులను సకాలంలో హాజరుపరిచిన అధికారులను జిల్లా ఎస్పీ దీపిక అభినందించారు.

క్లుప్తంగా

నేడు దుర్గమాంబ ఉత్సవం



రంగులు వేసిన అమ్మవారి ఆలయం

కశింకోట : గవరపేటలో వెలసిన దుర్గమాంబ ఉత్సవం గురువారం జరపడానికి ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవం సందర్భంగా అమ్మవారి విగ్రహానికి, ఆలయానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. విద్యుద్దీపాలంకరణ చేశారు.

సహకార సంఘం సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌ఛార్జి సుబ్రహ్మణ్యేశ్వరి

కశింకోట : సంఘం అభివృద్ధికి దోహదపడాలని నరసింగబిల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) పర్సన్ ఇన్‌చార్జి ఎ.సుబ్రహ్మణ్యేశ్వరి అన్నారు. మండలంలోని సంఘ భవనంలో సర్వసభ్య సమావేశం బుధవారం సాయంత్రం నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆడిట్ నివేదిక, వాస్తవ బడ్జెట్, అంచనా బడ్జెట్లను ఆమోదించారు. సంఘ సీఈవో నక్కా అచ్చియ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.


సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన

కశింకోట : మండలంలోని జమాదులపాలెం, వెదురుపర్తి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న రైతులకు సాగులో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. వరి పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి ఆల్పాన్సా జార్జి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు సహకార సంఘం సర్వ సభ్య సమావేశం

కశింకోట : కశింకోట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వ సభ్య సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు సంఘం ఆవరణలో జరుగుతుందని సీఈవో ద్వారపురెడ్డి నూకేశ్వరరావు తెలిపారు. పర్సన్ ఇన్‌చార్జి అధ్యక్షతన జరిగే సమావేశంలో సంఘం జమా ఖర్చులు, ఆడిట్ రిపోర్టు, వాస్తవ బడ్జెట్, అంచనా బడ్జెట్ల ఆమోదం, ఇతర సమస్యలపై సమావేశంలో చర్చిస్తామన్నారు. సంఘ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

సిమెంట్ పరిశ్రమకు నాణ్యతా పురస్కారం



విశాఖలో పురస్కారం అందుకుంటున్న రామ్‌కో డీజీఎం సురేష్

కశింకోట : మండలంలోని ఏఎస్ పేట వద్ద ఉన్న రామ్‌కో సిమెంట్ పరిశ్రమకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ పురస్కారం లభించింది. ఈ మేరకు విశాఖలో బీఐఎస్ సీనియర్ డైరెక్టర్ ఎం.వి.జె. వినోద్ పురస్కారం అందించారని పరిశ్రమ డీజీఎం ఎం. సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి నాణ్యమైన సిమెంట్ అందిస్తున్నందుకు పురస్కారం లభించిందన్నారు. ఈ విజయం పరిశ్రమ ఉద్యోగులు, కార్మికుల సమష్టి కృషి అన్నారు.

అనకాపల్లి సినిమాలు

గొర్రె పురాణం	:రాజా
ఏఆర్ఎం 3డీ	:సత్యనారాయణ స్క్రీన్-1
మత్తు వదలరా 2	: సత్యనారాయణ స్క్రీన్-2
ఆయ్	: పర్తిసాయి
సరిపోదా శనివారం	: షిర్డీసాయి
చిక్లెట్స్	:వెంకటేశ్వర
మన్యం ధీరుడు సీతారామరాజు	:శ్రీసత్య
హైడ్ ఎన్ సీక్	:రామచంద్ర

పశువుల బీమా..లేదు ధీమా

పశువుల బీమాకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల పట్ల పాడి రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రీమియం చెల్లించిన నెల రోజుల వరకు బీమాను వర్తింపజేయకపోవడం వల్ల తాము నష్టపోతున్నామని వారు వాపోతున్నారు. ఏ కారణం చేతనైనా తమ పశువులు మరణిస్తే బీమా సొమ్ము చేతికందక నష్టం చవిచూడాల్సి వస్తోందని.. ఈ నేపథ్యంలో నిబంధనలు సడలించాలని రైతులు కోరుతున్నారు.



నూతలగుంటపాలెంలో రైతులు సాకుతున్న పాడి ఆవులు



రైతులకు అదనపు ఆదాయం సమకూరుస్తున్న మినీ డెయిరీ

- ప్రీమియం అమలు తీరుపై పాడి రైతుల అసంతృప్తి
- నిబంధనలు సడలించాలని డిమాండ్

కశింకోట : మండలంలో పశువుల బీమా ప్రీమియం అమలు తీరుపై పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. నిబంధన పేరుతో ప్రీమియం చెల్లించిన నెల రోజుల వరకు దీన్ని వర్తింపజేయడం లేదంటున్నారు. దీంతో ఈలోగా ఏ కారణం చేతనైనా పశువు మరణిస్తే బీమా పరిహారం అందక నష్టపోవలసి వస్తుందని పాడి రైతులు వాపోతున్నారు. మండలంలో అత్యధిక శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. దీంతోపాటు అనుబంధంగా పాడి పశువులను సాకుతూ పాల అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయంతో వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఇక్కడ పాడి ఆవులు, గేదెలు సుమారు 23 వేల వరకు ఉన్నట్లు అధికారిక సమాచారం. ఇవి ఏ కారణంగానైనా మృతి చెందితే నష్టపోకుండా పరిహారం పొందడానికి పశువుల బీమా సదుపాయం ఉంది. దీన్ని ప్రభుత్వంతో పాటు విశాఖ పాల డెయిరీ, ప్రైవేటు బీమా సంస్థలు కల్పిస్తున్నాయి. దీంతో దాదాపు సగం పాడి పశువులకు ఆసక్తి కలిగిన రైతులు బీమా ప్రీమియం చెల్లిస్తున్నారు. ప్రభుత్వ పశు బీమాకు అయితే రూ.490, ప్రైవేటు సంస్థలకు అయితే పాడి గేదె లేదా ఆవు ఖరీదుపై 4 శాతం సొమ్మును చెల్లించాల్సి ఉంటెంది, ప్రభుత్వం బీమా పరిహారంగా ప్రీమియం గడువులోగా పశువు ఏ కారణం చేతనైనా మరణిస్తే కేవలం రూ.30 వేలు మాత్రమే చెల్లిస్తోంది. అదే ప్రైవేటు సంస్థలైతే రూ.60 వేలు, ప్రీమియంను అనుసరించి అంత కంటే ఎక్కువ పరిహారాన్ని కూడా అందిస్తున్నాయి. ప్రభుత్వ బీమా అయితే మూడేళ్లు, ప్రైవేటు బీమా ప్రీమియం అయితే ఏడాది మాత్రమే అమల్లో ఉంటుంది. అయితే ప్రీమియం చెల్లించిన వెంటనే దాన్ని వర్తింపజేయకుండా నెల రోజుల తర్వాత నుంచి బీమా వర్తింపజేస్తున్నారు. దీనికి పశువు ఆరోగ్య పరిస్థితి పరిశీలన దృష్ట్యా నిబంధనల మేరకు నెల రోజుల తర్వాత నుంచి బీమా వర్తింపజేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఈలోగా పశువు ఏ కారణం చేతనైనా మృతి చెందితే బీమా పరిహారం వర్తించని పరిస్థితి. దీంతో బీమా ప్రీమియం చెల్లించినప్పటికీ నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ప్రీమియం చెల్లించినప్పుడు బీమా సంస్థ పశు వైద్యుడు పాడి పశువు ఆరోగ్యం నిర్ధారిస్తూ సర్టిఫికెట్ ఇస్తున్నారని, అటువంటప్పుడు బీమాను నెల రోజుల వరకు వర్తింపజేయకుండా జాప్యం చేయడమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. దీనివల్ల తాము నష్టపోతున్నందున ప్రీమియం చెల్లించిన సత్వరమే బీమా వర్తింపజేసేలా నిబంధనలు సవరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

సత్వరం బీమా వర్తింపజేయాలి..



పశువుల బీమా ప్రీమియం చెల్లించినప్పటి నుంచి వర్తింపజేయడం లేదు. నెల రోజుల తర్వాత వర్తింపజేస్తున్నారు. ఇందుకు నిబంధనలు ఉన్నాయంటున్నారు. దీనివల్ల ఈలోగా పశువు ఏ కారణం చేతనైనా మరణిస్తే తీవ్రంగా నష్టపోతున్నాం. దీని దృష్ట్యా బీమా ప్రీమియం చెల్లించినప్పటి నుంచి బీమా వర్తింపజేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బుద్ద ఈశ్వరరావు, పాడి రైతు, కశింకోట.

నిబంధనలు సవరించాలి..



నేను నాలుగు పాడి ఆవులకు బీమా చేశాను. ఒకవేళ వీటికి హాని జరిగితే తీవ్రంగా నష్టపోవలసిన పరిస్థితి వస్తుంది. దీని దృష్ట్యా బీమా చెల్లించిన సత్వరమే వర్తించేలా నిబంధనలను సవరించాలి. అప్పుడే పాడి రైతులకు మేలు జరుగుతుంది. అలా కాకుంటే మాత్రం బీమా కట్టినా ఎటువంటి ప్రయోజనం ఉండదు.

– అల్లం శ్రీనివాసరావు, పాడి రైతు, నూతలగుంటపాలెం

నిబంధనల ప్రకారమే చెల్లింపులు..

నిబంధనల కారణంగా పశువుల బీమా ప్రీమియం చెల్లించిన నెల రోజుల తర్వాత నుంచి వర్తిస్తుంది. ప్రభుత్వం పశువుల బీమాకు ప్రీమియంగా రూ.490 తీసుకుంటుంది. పశువులకు నష్టం జరిగితే రూ. 30 వేలు పరిహారం చెల్లిస్తుంది. బీమా ప్రీమియం మూడేళ్ల వరకు వర్తిస్తుంది. అదే ప్రైవేటు సంస్థలైతే ఏడాది మాత్రమే ఇస్తున్నాయి.

– ఆల్పాన్సా జార్జి, మండల పశువైద్యాధికారి, కశింకోట.

అత్యధిక వర్షపాతం నమోదు



శారదా నది అవతల నీట మునిగిన వరి పొలాలు



నూతలగుంటపాలెంలో బురదమయంగా మారిన పల్లపు ప్రాంతం



తాళ్లపాలెం కూడలిలో నిలిచిపోయిన వర్షం నీరు



కన్నూరుపాలెంలో వర్షానికి గోతులతో అధ్వానంగా మారిన ఆర్ అండ్ బీ రోడ్డు

కశింకోట : మండలంలో మంగళవారం రాత్రి రికార్డు స్థాయిలో వర్షం కురిసింది. దీంతో 159.2 మిల్లీమీటర్ల వర్షం పడినట్లు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నమోదైంది. ఈ ఏడాది కురిసిన వర్షాల్లో ఇదే అత్యధికం. వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కశింకోట ఎంపీడీవో కార్యాలయం ముందు నీరు చేరింది. కశింకోట, వెదురుపర్తి, గొబ్బూరు, ఏనుగుతుని, నూతలగుంటపాలెం తదితర ప్రాంతాల్లోని ఆలస్యంగా వరి నాట్లు వేసిన పంట భూములు నీట మునిగాయి. తాళ్లపాలెం, జి.భీమవరం, ఎల్.కొత్తూరు తదితర ప్రాంతాల్లో చెరకు తోటలు, సరుగుడు తోటలు నీట మునిగాయి. తాళ్లపాలెంలో మామిడివాక గెడ్డ, విసన్నపేటతో పాటు పలు ప్రాంతాల్లో ఉన్న కొండ గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. బయ్యవరంలో పెద్ద చెరువు, ఎల్. కొత్తూరు తదితర ప్రాంతాల్లోని చెరువుల్లో అధికంగా నీరు చేరింది. ఇది వరి సాగుకు ఉపకరిస్తుందని రైతులు తెలిపారు. గత తుపాను తర్వాత మండుటెండలు కాశాయి. దీంతో పలుచోట్ల ముందుగా వేసిన వరి పొలాలకు నీరు అవసరమైన సమయంలో భారీ వర్షం కురవడం రైతులకు ఊరట కలిగించింది. పలు చోట్ల పొలాలు కళకళలాడుతున్నాయి. తాళ్లపాలెం కూడలిలో నీరు నిల్వ ఉండిపోవడం వల్ల వాహన చోదకులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. అలాగే అక్కడి హైస్కూలు మైదానంలో నీరు నిల్వ ఉండిపోయింది. అసంపూర్తిగా ఉన్న పోలవరం కాలువలో కూడా నీరు చేరింది.

కన్నూరుపాలెంలో..

కశింకోట : మండలంలోని కన్నూరుపాలెంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రోడ్డు గోతులు పడింది. తాళ్లపాలెం-నర్సీపట్నం రోడ్డులో ఇక్కడ గత వర్షాలకు గోతులు పడటంతో స్థానికులు తాత్కాలికంగా పూడ్చారు. అది భారీ వాహనాల తాకిడి, వర్షాలకు మళ్లీ శిథిలమైంది. అయితే రోడ్లు, భవనాల శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని, తమకు ఇబ్బందులు తప్పడం లేదని వాహన చోదకులు, ప్రజలు వాపోతున్నారు. దీనివల్ల ప్రమాదాలకు గురవుతున్నామని, సత్వరమే గోతులు పూడ్చడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే వర్షానికి నూతలగుంటపాలెంలోని పల్లపు ప్రాంతంలోని రోడ్లు బురదమయంగా మారాయి. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. లాలం కొత్తూరు వద్ద భూముల్లో నీరు చెరువులా చేరింది.

మోతాదుకు మించి పురుగు మందులు వాడొద్దు



వడ్డాదిలో పొలంబడి కార్యక్రమంలో సూచనలిస్తున్న ఏవో భాస్కరరావు



చౌడువాడలో సూచనలు చేస్తున్న మండల వ్యవసాయాధికారి సోమశేఖర్

- వ్యవసాయాధికారి భాస్కరరావు

బుచ్చెయ్యపేట: పురుగు మందులను మోతాదు మించి వాడవద్దని మండల వ్యవసాయాధికారి భాస్కరరావు రైతులకు సూచించారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం వడ్డాదిలో వరి పొలాలను ఏవో తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. వరి పంట ఆశాజనకంగా ఉండి, తెగుళ్ల బెడద లేకపోయినా పలువురు రైతులు మందులు వేయడాన్ని గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోతాదుకు మించి మందులు వినియోగిస్తే మిత్ర పురుగులు చనిపోవడమే కాక రైతులకు అదనపు పెట్టుబడి భారంతో పాటు పంటను వినియోగించే వారికి ఆరోగ్య సమస్యలు వస్తాయని చెప్పారు. వడ్డాది పాండవుల చెరువు నుంచి నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరారు.

చౌడువాడలో పొలం పిలుస్తోంది

కె.కోటపాడు: చౌడువాడలో బుధవారం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగు విధానం, ఎరువులు, పురుగు మందుల వినియోగంపై వ్యవసాయాధికారి సోమశేఖర్ రైతులకు అవగాహన కల్పించారు. మోతాదుకు మించి పురుగు మందులు వాడితే జరిగే అనర్థాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎరుకునాయుడు, ఎంపీటీసీ వై.రాజునాయుడు, పాలకేంద్రం అధ్యక్షుడు ఎర్నినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులపై అవగాహన అవసరం

చీడికాడ: పంటల సాగులో ఆధునిక పద్ధతులు,తెగుళ్ల నివారణపై రైతులు అవగాహన ఏర్పర్చుకోవాలని కె.వి.కె. శాస్త్రవేత్త బాబు తెలిపారు. మండలంలోని అర్జునగిరి,చీడిపల్లి గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన పలు సలహాలు,సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏవో రమాదేవితో పాటు అర్జునగిరి,చీడిపల్లి సర్పంచ్‌లు బి.రమాదేవి,కె.సూర్యనారాయణ, రైతులు ప్రసాదు,శంకరరావు పాల్గొన్నారు.




అర్జునగిరిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

సమాజాన్ని ప్రభావితం చేసేది కార్టూన్



కార్టూన్ల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు సత్యనారాయణ, కామిరెడ్డి వరహాలబాబు

నాతవరం: కార్టూన్లు సమాజాన్ని ప్రభావితం చేస్తాయని ఎంఈవోలు సత్యనారాయణ, కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. మండలంలో చమ్మచింత గ్రామానికి చెందిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ప్రముఖ కార్టూనిస్ట్ అంబటి రాంబాబు తాను గీసిన కార్టూన్లతో ఏసీబీ పుస్తకాన్ని రూపొందించారు. ఆ పుస్తకాన్ని మండల విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం ఎంఈవోలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చంటిబాబు మాస్టారు రూపొందించిన కార్టూన్ల పుస్తకం పిల్లలు, పెద్దలను ప్రభావితం చేసేలా ఉందన్నారు. చంటి బాబు మాస్టారు గతంలో కూడా పిల్లలు కోసం అనేక కార్టూన్లు వేసి, ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిందని చెప్పారు. ఇప్పుడు మళ్లీ కొత్తగా కార్టూన్ల పుస్తకం తీసుకురావడం చాలా ఆనందాయకమన్నారు. అనంతరం చంటిబాబు మాస్టార్‌ను ఎంఈవోలతో పాటు మండలంలోని పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయ యూనియన్ల నాయకులు ఘనంగా సన్మానించారు.



చంటిబాబు రూపొందించిన కార్టూన్ల పుస్తకం

ఉద్యానవన పంటలతో అధిక ఆదాయం

కె.కోటపాడు : ఉద్యానవన పంటల సాగుతో రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చని జిల్లా ఉద్యానవనశాఖాధికారి ప్రభాకరరావు తెలిపారు. ఉద్యానవన పంటల సాగుకు ఆసక్తి గల రైతులకు ప్రభుత్వం రాయితీలను కల్పించనున్నట్టు చెప్పారు. గొందుపాలెంలో కృషిఫల రైతు ఉత్పత్తిదారుల సంఘం 5వ వార్షికోత్సవాన్ని సంఘం చైర్మన్ బండారు దేముళ్లు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రభాకరరావు మాట్లాడుతూ కె.కోటపాడు మండలంలోని 20 గ్రామాల్లో సుమారు 500 మంది రైతులు కృషిఫల రైతు ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యులుగా ఉన్నారని చెప్పారు. ఆయా గ్రామాల్లో రైతులు పండించిన పంటలను ఉత్పత్తిదారుల సంఘానికి విక్రయించడం ద్వారా మద్దతు ధరను పొందవచ్చన్నారు. రైతులు సంఘంగా ఏర్పడి వ్యవసాయాన్ని చేస్తే ప్రభుత్వం ద్వారా ప్రోత్సాహన్ని అందించేందుకు చర్యలను చేపట్టనున్నట్టు తెలిపారు. జాగృతి మేనేజింగ్ డైరెక్టర్ సుజాత, ఉద్యానవనశాఖాధికారి కిరణ్మయి, ఏవో సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సాగులో మెలకువలతో మెరుగైన దిగుబడి



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ అధికారి మోహనరావు

తుమ్మపాల : వరినాట్లు వేసిన 60 రోజులకు అవి చిరు పొట్ట దశకు చేరుకుంటాయని, 45 రోజులు పూర్తయిన వరినాట్లకు ఎకరాకు 25 కేజీల యూరియా, 20 కేజీల పొటాష్ వెయ్యాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి బి.మోహనరావు రైతులకు సూచించారు. మండలంలో సీతానగరం, తగరంపూడి గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పొలం పిలుస్తుంది'కార్యక్రమంలో పాల్గొని వరి పొలాలను సందర్శించారు. పొలం పిలుస్తుంది కార్యక్రమం ద్వారా రైతులకు సాగులో మెలకువలు బోధించనున్నట్లు తెలిపారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షం వరి పొలాలకు ఉపయోగకరమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీ ఎరువులు, వాటి వివరాలు, సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్త రమణమూర్తి మాట్లాడుతూ శారదా నది పరిసర ప్రాంతాల్లో ఆర్‌జీఎల్ 25.37 రకాన్ని ఎక్కువగా వేస్తున్నారని, కానీ ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 12.24, ఎంటీయూ 13.18 వరి రకాలను సాగు చేసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు రామారావు, రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ శ్రీధర్, మురళి, ఏవో పి.రంగాచారి, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామారావు, మార్కెటింగ్ శాఖ అధికారి రాజేష్, సర్పంచులు సుంకర చంటి, యాదగిరి అప్పారావు, రైతు నాయకులు ప్రకాష్, సేంద్రియ వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కూలీ రేట్లు పెంచాలని నిరసన



కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న కూలీలు

తుమ్మపాల : తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న సివిల్ సప్లయి హమాలీల కూలీ రేట్ల అగ్రిమెంట్‌ను తక్షణమే అమలు చేయాలంటు హమాలీలు కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. మండలంలో రేబాక గ్రామంలో ఉన్న రాష్ట్ర సివిల్ సప్లయి గోదాం వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సప్లయి హమాలీస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రతి రెండేళ్లకు హమాలీల కూలీ రేట్లు పెంచాలని, గత ఏడాది డిసెంబర్ 31తో అగ్రిమెంట్ గడువు ముగిసినప్పటికీ కూలీల రేట్లు పెంచకుంఉ తాత్సారం చేస్తున్నారని జిల్లా యూనియన్ ప్రధాన కార్యదర్శి కండేపల్లి త్రినాథ్ అన్నారు. కూటమి ప్రభుత్వం హామీ మేరకు ఇప్పటికైనా హమాలీల కూలీ రేట్ల అగ్రిమెంట్ జీవోను రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హమాలీలు పోలవరపు సత్తిబాబు, సింహాచలం, సుత్తుక రాజు, కరణం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

దివంగత గాయకుడు బాలుకు ఘన నివాళి



బాలు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న గాయనీ గాయకులు

తుమ్మపాల : దాదాపు 50 వేలకు పైగా అద్భుతమైన పాటలు పాడి, సంగీత దర్శకునిగా, డబ్బింగ్ ఆర్టిస్టుగా, నటునిగా, నిర్మాతగా అనేక శాఖల్లో తనదైన ముద్ర వేసుకున్న గొప్ప గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అని సంగీత దర్శకుడు ఇంద్రగంటి లక్ష్మీ శ్రీనివాస్ అన్నారు. పద్మవిభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నాల్గవ వర్ధంతిని పురస్కరించుకుని ఉడ్‌పేటలో కళ్యాణి అకాడమీ ఆఫ్ ఆర్ట్స్‌లో బుధవారం ఆయన వర్ధంతి నిర్వహించి నివాళులు అర్పించారు. ఆయన పాడిన పలు గేయాలను విద్యార్థులు ఆలపించి అలరించారు. ఈ సందర్భంగా ఇంద్రగంటి లక్ష్మీ శ్రీనివాస్ మాట్లాడుతూ నేటితరానికి, రాబోయే తరాలకు బాలు గొప్ప స్ఫూర్తి అన్నారు.

బాలు జీవితంలో పాడిన ఒకే ఒక్క లఘు చిత్రానికి తాను సంగీత దర్శకుడిగా పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. 2002 జూన్ 21న ప్రపంచ సంగీత దినోత్సవం రోజున పట్టణంలో కళ్యాణి అకాడమీ ప్రారంభానికి బాలు ముహూర్తం సూచించారని తెలిపారు. ఆసక్తి గల వారికి కళ్యాణి అకాడమీ ద్వారా సంగీతం నేర్పించే అవకాశం కలిగించారన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ ప్రిన్సిపాల్ నడిగట్ల వెంకటలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ కేసులను గుర్తించాలి



తాళ్లపాలెం పీహెచ్‌సీలో మాట్లాడుతున్న ఎన్ఎల్ఈపీ, లెప్రసీ జాయింట్ డైరెక్టర్ దేవసాగర్

కశింకోట : లెప్రసీ కేసులను గుర్తించడానికి పక్షం రోజులకు ఒకసారి ఆశ, ఆరోగ్య కార్యకర్తలు ఇళ్లను సందర్శించాలని ఎన్ఎల్ఈపీ, లెప్రసీ జాయింట్ డైరెక్టర్ ఎస్.దేవసాగర్ కోరారు. మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి వైద్య, ఆరోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఇళ్ల వద్ద గుర్తించిన అనుమానిత కుష్టు వ్యాధి కేసులను ఆరోగ్య సిబ్బంది పీహెచ్‌సీలకు సిఫారసు చేయాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి యు. రమేష్, ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి ఎ.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

నర్సీపట్నం : మున్సిపల్, పోలీసు అధికారులు సమన్వయంతో మున్సిపాలిటీలోని శారదానగర్ మెయిన్ రోడ్డులో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించారు. మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, సీఐ రేవతమ్మ, ఎస్ఐ రమేష్ పర్యవేక్షణలో శ్రీకన్య కూడలి నుంచి మంగీలాలు స్వీట్‌స్టాల్ వరకు మున్సిపల్, పోలీసు సిబ్బంది ఆక్రమణలు తొలగించి, మెయిన్ రోడ్డుకు మధ్యలో గుంతలను గ్రావెల్‌తో పూడ్చారు. ఫుట్‌పాత్‌పై దుకాణాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించవద్దని సీఐ రేవతమ్మ వ్యాపారులకు తెలిపారు.